క్లుప్తంగా

తాగునీటి బోరు ఏర్పాటు



బోరును ప్రారంభిస్తున్న నాయకులు

దుద్యాల్: తాగునీటి కోసం మరో నూతన బోరును అందుబాటులోకి తీసుకువచ్చామని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి అనంతయ్య పేర్కొన్నారు. సోమవారం ఆలేడ్ గ్రామంలో రూ.2.5 లక్షల వ్యయంతో బోరు మోటార్ బిగించారు. దీంతో కొంత నీటి సమస్యలకు తిప్పలు తప్పాయని గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్ రాథోడ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్‌గౌడ్, నర్సిములుగౌడ్, అశోక్, పక్కీరప్ప, రాములు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ



పాఠశాలకు టీవీని బహూకరిస్తున్న దాతలు

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి టీవీ, టై, బెల్ట్, ఐడీ కార్డులు అందజేయడం అభినందనీయమని బడేంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం గ్రామానికి చెందిన వెంకటేశ్, అశోక్, దశరథ్ విద్యార్థులకు టీవీ, టై, బెల్ట్, ఐడీ కార్డులను మండల విద్యాధికారి వెంకట్‌తో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్, అమ్మ ఆదర్శ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గౌరమ్మ, ఉపాధ్యాయులు రాజు, వినోద్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



ఆలయ నిర్మాణానికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కుల్కచర్ల: ప్రజల మనోభావాలకు అనుగుణంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల నిర్మాణానికి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని బిందెం గడ్డతండా గ్రామ పంచాయతీలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయ విస్తరణకు నూతనంగా కమిటీ వేసి ప్రభుత్వ ప్రోత్సాహానికి ప్రతిపాదనలు పంపించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌నాయక్, శ్రీనునాయక్, రవి, మోతిలాల్, హన్మంతు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను ఆదుకోవాలి

ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు గుల్షన్

కొడంగల్ రూరల్: రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు, దుకాణ సముదాయాలను కోల్పోతున్న వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఎంఐఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కొడంగల్ అభివృద్ధికి ఎంఐఎం పార్టీ వ్యతిరేకం కాదని, రోడ్డు పక్కలో ఉన్న డబ్బాలు తొలగించడంతో చిరువ్యాపారులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొందన్నారు. ఇళ్లు, దుకాణాల సముదాయాలను కోల్పోతున్న వారికి పరిహారం అందించేందుకు ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు.

విమోచన సంబరాల్లో మన కళాకారులు

బొంరాస్‌పేట: మహానగరంలో ఈనెల 17న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవం సంబరాల్లో జిల్లా కళాకారులకు అవకాశం దక్కింది. జానపద కళాకారుడు, టీమ్ లీడర్ ప్రకాశ్ మాస్టర్ బృందం ఎంపికైంది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న విమోచన దినం సంబరాలకు రాష్ట్ర జానపద కళా ప్రదర్శనలు వినూత్నంగా ప్రదర్శించనున్నారు. ఇందులో ప్రకాశ్‌మాస్టర్ బృందం 15మంది కళాకారులు బంజారా నృత్యం ప్రదర్శించే అవకాశం లభించినట్లు చెప్పారు. కళాకారుల్లో కృష్ణయ్య, అంజిలప్ప, తులసి, కస్తూర్బా విద్యార్థినులు మహేశ్వరి, శ్వేత, మనీష, లక్షిత, చిన్నారి, మానస, నికిత, రాణి తదితరులున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి ప్రయాణికులు తమ సమస్య లు, సూచనలు తెలియజేయాలని కోరారు. 99592 26287 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

- వర్షాలకు చిత్తడిగా మారిన లింగన్‌పల్లి-ఎల్లారెడ్డిపల్లి రహదారి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



రోడ్డుపై వరి నాట్లు వేస్తున్న గ్రామస్తులు (ఫైల్)



చిత్తడిగా మారిన లింగన్‌పల్లి-ఎల్లారెడ్డిపల్లి రోడ్డు

దోమ: అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతో గ్రామీణ రహదారులు దారుణంగా మారాయి. చినుకు పడితే చాలు చిత్తడిగా మారి గ్రామస్తులకు, వాహనదారులకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం గ్రామీణ రోడ్లను విస్మరించినప్పటికీ.. కాంగ్రెస్ ప్రభుత్వమైన వేస్తుందని ప్రజలు భావిస్తున్నారు. కానీ అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు అవుతున్నా నేటికి గ్రామీణ రోడ్లపై దృష్టి సారించడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రెండు కిలోమీటర్లు నరకమే

మండల కేంద్రం నుంచి కూతవేటు దూరంలో ఉన్న లింగన్‌పల్లి-ఎల్లారెడ్డిపల్లి గ్రామాలకు కేవలం రెండు కిలోమీటర్లే ఉంటుంది. వర్షం పడితే చాలు రోడ్డు పూర్తిగా గుంతలుగా మారి బురదతో అస్తవ్యస్తంగా తయారవుతుంది. ఏళ్ల తరబడి ప్రజలు నిత్యం అదే రోడ్డుపై ప్రయాణాలు సాగిస్తుంటారు. కురుస్తున్న వర్షాలకు నీరు గుంతలలో నిలిచి వాహనదారులను నానా ఇబ్బందులకు గురి చేస్తుంది. ప్రయాణం నరకప్రాయంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయం లేక అదే రోడ్డుపై నిత్యం ప్రయాణాలు సాగిస్తూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఇంటికి చేరుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. నూతన రోడ్డు వేయాలని పలుమార్లు అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

పాలకులకు పట్టదా?

ప్రస్తుతం, గత పాలకులకు గ్రామీణ రహదారులపై చిత్తశుద్ధి లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రతి రోడ్డును పూర్తి చేస్తామని చెప్పిన నేతలు.. నేడు గ్రామీణ రోడ్లను ఎందుకు విస్మరిస్తున్నారని లింగన్‌పల్లి-ఎల్లారెడ్డిపల్లి గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజలు గుర్తుకు వస్తారా? మిగతా సమయాల్లో ప్రజా సమస్యలు పట్టవా అంటూ మండిపడుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



గ్రామానికి వెళ్లే రోడ్డు వర్షానికి బురదమయంగా తయారవుతుంది. ప్రయాణించాలంటే ఇబ్బందులకు గురవుతున్నాం. పలుమార్లు బురదలో కిందపడిన సందర్భాలున్నాయి. అధికారులకు రోడ్డు విషయం తెలిసినా పట్టించుకోవడం లేదు. పరిగి ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు దృష్టి సారించి బీటీ రోడ్డు వేయాలి.

– మొగులయ్య, గ్రామస్తుడు, లింగన్‌పల్లి

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



లింగన్‌పల్లి-ఎల్లారెడ్డిపల్లి గ్రామాలకు కొన్నేళ్ల నుంచి రోడ్డు లేని విషయాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. వాహనదారుల ఇబ్బందులను వివరించాం. త్వరలో బీటీ రోడ్డును వేయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదు.

– బల్లరాణి, మాజీ సర్పంచ్, లింగన్‌పల్లి

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది



కోట్‌పల్లిలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

బంట్వారం: ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో ఉన్నతమైనదని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కోట్‌పల్లి మానవ వనరుల కేంద్రంలో ఉత్తమ టీచర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డానియల్, హెచ్‌ఎంలు శారద, మొహినోద్దీన్, తపస్ మండల బాధ్యుడు మహిపాల్‌రెడ్డి సన్మాన గ్రహీతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

కుల్కచర్ల: ఉత్తమ ఉపాధ్యాయులకు మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చౌడపూర్ ఎంఈఓ రాంచందర్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మండలంలో 16 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారన్నారు. వారిని మండల కేంద్రంలో సత్కరిస్తామని, ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి

మర్పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చేది గురువులేనని తహసీల్దార్ తులసీరాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 5న జిల్లా, మండల స్థాయిలో ఎంపికైన 20 మంది ఉపాధ్యాయులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న తోటి గురువులు

దోమ: ఉపాధ్యాయులకు పదోన్నతులు రావడం హర్షనీయమని మండల విద్యాధికారి వెంకట్ అన్నారు. మండల పరిధిలోని బుద్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించిన కె.లక్ష్మణ్‌కు ఇటీవల బయోసైన్స్ ఉపాధ్యాయుడిగా పదోన్నతి లభించింది. ఈ మేరకు సోమవారం ఆయనకి మండల విద్యాధికారి, ఉపాధ్యాయులతో కలిసి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్, సెక్రటరీ వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు సువర్ణ, భీమ్లా, మధు, సీఆర్‌పీ రెడ్యానాయక్, గ్రామస్తులు నర్సప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'రీజినల్' అలైన్‌మెంట్ మార్చొద్దు



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న రైతులు, నాయకులు

కందుకూరు: మార్చిన రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కందుకూరు చౌరస్తాలో ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ.. వందల ఎకరాలున్న భూస్వాముల భూములను కాపాడడం కోసం పేద, సన్న, చిన్నకారు రైతుల భూములను రీజినల్ రింగ్ రోడ్డు పేరుతో దౌర్జన్యంగా తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే కొత్త అలైన్‌మెంట్‌ను రద్దు చేసి పాత అలైన్‌మెంట్ ప్రకారమే భూసేకరణ చేపట్టాలని అన్నారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కానుగుల వెంకటయ్య, ప్రజా సంఘాల నాయకులు గుమ్మడి కురుమయ్య, పిప్పళ్ల శివశంకర్, అంకగళ్ల కుమార్, మాజీ ప్రజా ప్రతినిధులు గడిగ వెంకటస్వామి, లక్ష్మయ్య, పబ్బతి శ్రీను, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

మోమిన్‌పేట: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌తో కలిలి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు అనారోగ్యానికి గురైతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం ఆదుకొంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, సుభాష్‌గౌడ్, సిరాజోద్దీన్, చంద్రయ్య, గిరిసింగ్, సంగమేశ్వర్‌గౌడ్, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

అదనపు పనిభారం తగ్గించండి



కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ంలు

బొంరాస్‌పేట: ఏఎన్‌ఎంలకు ఆన్‌లైన్ పనులు అదనపు భారంగా మారుతున్నాయని సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయా మండలాలకు చెందిన ఏఎన్‌ఎంలు ప్రజావాణిలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తోపాటు డీఎంహెచ్‌ఓలకు వినతి పత్రాలు అందజేశారు. కొంత కాలంగా ఎన్‌సీడీ ప్రోగ్రామ్‌లో ఏఎన్‌ఎంలతో స్క్రీనింగ్ టెస్టుల తోపాటు ఆఫ్‌లైన్ రిపోర్టులు చేయిస్తున్నామని, తాజాగా ఆన్‌లైన్ కూడా చేయాలని ఒత్తిడి పెరుగుతోందన్నారు. దీంతో పనిభారం అధికమవుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ పనుల నుంచి మినహాయించాలని కోరారు. ఇందులో తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని ఏఎన్‌ఎంలు లీలావతి, వెంకటమ్మ, భారతి, కవిత, పాపమ్మ, అనిత, అనంతలక్ష్మి, జయమాల, రజియా, చంద్రకళ, శాంత, సుమలత వినతిపత్రం అందజేశారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం



ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల: అర్హులైన పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అనుసరించి అర్హులైన నిరుపేదలకు ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, చంద్రభూపాల్, బాలకృష్ణయ్య, రాములు, శివకుమార్, నర్సయ్య, కారోబార్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ఆధ్వర్యంలో స్టడీ టూర్



టూర్‌కు బయలుదేరే ముందు చైర్మన్ మహేందర్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు

మర్పల్లి: ఇతర రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ధాన్యం క్రయవిక్రయాలు తెలుసుకోడానికి మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యం స్టడీ టూర్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ తమ పాలకవర్గం సభ్యులతో కలిసి స్టడీ టూర్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో మార్కెట్ ఆదాయం కోసం చేపడుతున్న అంశాలను తెలుసుకొనేందుకు స్టడీ టూర్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, మార్కెట్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకం

రంగారెడ్డి డీఈఓ సుశీందర్‌రావు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న డీఈఓ సుశీందర్‌రావు

షాద్‌నగర్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద కేజీబీవీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠాలు బోధించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమైన మెట్టు అని అన్నారు. క్రమ శిక్షణతో కూడిన విద్యను నేర్చుకొని పరీక్షల్లో రాణించాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహం, సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మనోహర్, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్ హామీని నెరవేర్చాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిములు మాదిగ



తాండూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, పింఛన్‌దారులు

తాండూరు రూరల్: చేయూత కింద ఇచ్చే పింఛన్లను పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జినుగుర్తి నర్సిములు మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం తాండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట పింఛన్‌దారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు నెలకు రూ.2 వేల నుంచి రూ.4 వేలకు.. దివ్యాంగులకు రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తయినా ప్రభుత్వం పింఛన్ పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ తారాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బలరాం మాదిగ, రవి, సుందర్, చందు, గజలప్ప, నారాయణరెడ్డి, అశోక్‌రాజు, రాజశేఖర్, యాదయ్య, ఖాజపాషా, సుశీలమ్మ, గౌరమ్మ, భాగ్యలక్ష్మి, భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు వెంటనే పెంచాలి

యాలాల: ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు అందజేస్తున్న సామాజిక పింఛన్లు వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మెట్లి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పింఛనుదారులకు ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మప్ప, నాయకులు క్రిష్ణ, నర్సింహులు, శ్రావణ్‌కుమార్, నరేందర్, నరేష్, శాంతు, మల్లేషం, పకీరప్ప, శాంతమ్మ, పద్మమ్మ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం

బొంరాస్‌పేట: ప్రభుత్వం చేయూత పింఛన్లు వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో దివ్యాంగులు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల హామీలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి వితంతు, వృద్ధులు, దివ్యాంగులకు పెంచుతామని రెండేళ్లు కావస్తున్నా పెంచకపోవడం బాధాకరం అన్నారు. వెంటనే పింఛన్లు పెంచాలని కోరారు.

పెంచేవరకు ఉద్యమిస్తాం

బషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేయూత పింఛన్లు పెంచేవరకు ఉద్యమిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గజ్జల ప్రవీణ్ ప్రకాశ్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఆందోళన చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమాదిగ, నర్సిములు, రాజు, రవి, కరీ, నారాయణ, జయశ్రీ, జెన్నమ్మ, శ్యామప్ప, ఎల్లమ్మ, వెంకటమ్మ, బసమ్మ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాల ఎదుట..

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న చేయూత పెన్షన్‌ను వెంటనే పెంచి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కుల్కచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాలలోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టి వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో మొగులయ్య, బిచ్చయ్య, శివాజీ, వెంకటయ్య, యాదయ్య, ఎల్లయ్య, భీంసేన్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోవాలి

పరిగి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి రవికుమార్ అన్నారు. సోమవారం తహసీల్దార్ వెంకటేశ్వరికి పెన్షన్‌దారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.



యాలాల: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, పింఛనుదారులు



కుల్కచర్ల: డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, వృద్ధులు